క్లుప్తంగా

భక్తి శ్రద్ధలతో దుర్గా పూజ



అమ్మవారి పూజల్లో భక్తులు

కర్నూలు కల్చరల్: నగర శివారులోని సూర్యనారాయణ స్వామి ఆలయంలో మహాగౌరీ అమ్మవారి సన్నిధిలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు రాహుకాల, దుర్గా పూజ, లలితా సహస్రనామ పారాయణం తదితర విశేష పూజలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

మైనారిటీ హాస్టల్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

కర్నూలు(అర్బన్): నగరంలోని గడియారం ఆసుపత్రి సమీపంలో ప్రభుత్వ ఉర్దూ బాలుర పాఠశాల ఆవరణలో ఉన్న మైనారిటీ బాలికల హాస్టల్‌లో ప్రవేశం పొందాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి సునీల్‌కన్నా శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. 2024–25 విద్యా సంవత్సరానికి 18 సీట్లు ఖాళీగా ఉన్నాయని, అర్హత, ఆసక్తి కలిగిన 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న మైనారిటీ విద్యార్థినుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ హాస్టల్‌లో విద్యార్థినులకు వసతితో పాటు ప్రభుత్వ మెనూ ప్రకారం ఉచిత భోజన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ప్రవేశం పొందేందుకు మూడు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, ప్రస్తుతం చదువుతున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుల నుంచి బోనోఫైడ్ సర్టిఫికెట్, తహసీల్దార్ నుంచి ఆదాయ ధ్రువీకరణ పత్రాలను జతపరచాలన్నారు. మరిన్ని వివరాలకు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ సెల్: 94916 53323 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

రేపు తేజోమయానంద మహారాజ్ జన్మదిన వేడుకలు

కర్నూలు కల్చరల్: చిన్మయ మిషన్ సర్వాధ్యక్షులు పూజ్య గురూజీ తేజోమయానంద మహారాజ్ 74వ జన్మదిన వేడుకలను ఈనెల 30వ తేదీన వీఆర్ కాలనీలోని చిన్మయ ప్రభావళిలో నిర్వహిస్తున్నట్లు మిషన్ బాధ్యులు స్వామిని సుప్రేమానంద సరస్వతి తెలిపారు. సాయంత్రం 5.30 గంటలకు గురు పాదుకా పూజ, బాల విహార్ చిన్నారులచే సాంస్కృతిక కార్యక్రమలు నిర్వహిస్తామన్నారు. మిషన్ సభ్యులు, భక్తులు అందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

రేపు నగర సంకీర్తన

కర్నూలు కల్చరల్: అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీ ఉదయం 6 గంటలకు నగర సంకీర్తన నిర్వహిస్తున్నట్లు కర్నూలు ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక్ ప్రభు తెలిపారు. ఓల్డ్ సిటీలోని రంగరాజు గేరి నుంచి సంకీర్తన కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై వినతి

కర్నూలు(సెంట్రల్): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి పెండింగ్ అర్జీలకు నిధులు విడుదల చేయాలని భవననిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.సుధాకరప్ప, ఖాజాబాషా డిమాండ్ చేశారు. శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో లేబర్ ఆఫీసర్ కె.వెంకటేశంకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇసుకను ఉచితంగా ఇవ్వాలన్నారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. సంక్షేమ బోర్డు ద్వారా గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మౌలాలి, బాషా,ఏసు పాల్గొన్నారు.

జీతాలు పెంచండి

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయంలో విధులు నిర్వహిస్తున్న అవుట్‌సోర్సింగ్ సిబ్బంది తమకు జీతాలు పెంచాలని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డికి వినతి పత్రం అందజేశారు. శుక్రవారం సుమారు 25 మంది అవుట్ సోర్సింగ్ సిబ్బంది విధులు బహిష్కరించి ఏడీ బిల్డింగ్ వద్ద వర్సిటీ వైస్‌చాన్స్‌లర్ బి.సుధీర్ ప్రేమ్ కుమార్, రిజిస్ట్రార్ డాక్టర్ నాగుల అంకన్న కోసం ఎదురు చూశారు. వీరు అందుబాటు లేకపోవడంతో రెక్టార్ ఆచార్య ఎస్.టి.కె.నాయక్‌ను కలిసి తమ సమస్యను వివరించారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సంవత్సరాల తరబడి తక్కువ జీతంతో విధులు నిర్వహిస్తున్నామని పనికి తగ్గ వేతనం ఇవ్వడం లేదని వెల్లడించారు. వీసీ, రిజిస్ట్రార్ లేనిది తానేమీ చేయలేనని, వారు వచ్చిన తరువాత నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. దీంతో వారు మంత్రి, ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం సమర్పించారు.

1న ఇంటి వద్దకే పెన్షన్లు

కర్నూలు (టౌన్): వచ్చే నెల 1 వ తేదీన సచివాలయాల కార్యదర్శులు లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వచ్చి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేస్తారని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలో ఉదయం 6 గంటల నుంచే ఈ ప్రకియ ప్రారంభమవుతుందన్నారు. నగరంలో 26 రకాల పెన్షన్లకు అర్హులైన 33,751 మందికి రూ.23,20,41, 500 అందించేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు.

విద్యుత్ సమస్యలు అధిగమించేందుకు చర్యలు

- నగరంలో 33కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయండి
- విద్యుత్ శాఖ అధికారులతో సమీక్షలో మంత్రి టీజీ భరత్



విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు(సెంట్రల్): నగరంలో విద్యుత్ సమస్యలను అధిగమించేందుకు వాటర్ వర్క్స్ సమీపంలో కొత్తగా 33కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపాలని పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖమంత్రి టీజీ భరత్ విద్యుత్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహంలో ఏపీఎస్‌పీడీసీఎల్ అధికారులతో కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గంలోని విద్యుత్ సమస్యలు, వాటికి పరిష్కారాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కొత్త విద్యుత్ సబ్ స్టేషన్ కోసం 10సెంట్ల స్థలం అవసరం అవుతుందని, మునిసిపల్ అధికారులతో మాట్లాడి ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. పాతబస్తీలో విద్యుత్ వైర్లను పైకి పెట్టేందుకు ఎత్తుగా ఉన్న కరెంట్ పోళ్లను ఏర్పాటు చేసేందుకు రూ.4 కోట్లతో ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. వర్షాకాలం వస్తుండడంతో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో విద్యుత్ సమస్యను అధిగమించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సమీక్ష సమావేశంలో ఎస్‌ఈ ఉమాపతి పాల్గొన్నారు.

పాతబస్తీలో ట్రాఫిక్ కష్టాలు తీరుస్తాం

నగరంలోని పాతబస్తీలో ట్రాఫిక్ కష్టాలు తీర్చేందుకు తగిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖమంత్రి టీజీ భరత్ అన్నారు. శుక్రవారం ఆయన ప్రభుత్వ అతిథిగృహంలో టౌన్ ప్లానింగ్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..చౌక్ బజార్ నుంచి జమ్మిచెట్టు వరకు వెళ్లే దారితోపాటు వన్ పోలీసు స్టేషన్, రాంబొట్ల దేవాలయాలకు వెళ్లే రహదారుల్లో ఎక్కువగా ట్రాఫిక్ కష్టాలు ఉన్నాయన్నారు. ఈ రహదారులను విస్తరించేందుకు టౌన్ ప్లానింగ్ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. అయితే షాపులు, ఇళ్లు కోల్పోతున్న వారి అంగీకారంతోనే రోడ్డు విస్తరణ చేయాలన్నారు.

మంత్రి టీజీ భరత్‌ను కలిసిన కలెక్టర్



కలెక్టర్ పి.రంజిత్ బాషా శుక్రవారం సాయంత్రం పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌ను కలిశారు. ఉదయం ఆయన జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ క్రమంలోనే మంత్రిని మర్యాదపూర్వకంగా సంకల్‌బాగ్‌లోని ఆయన నివాసంలో కలిశారు. శాలువా కప్పి సన్మానం చేశారు. అనంతరం మంత్రి, కలెక్టర్ జిల్లా అభివృద్ధి విషయాలపై చర్చించుకున్నారు. మరోవైపు మంత్రి హోదాలో కర్నూలుకు వచ్చిన బీసీ జనార్ధన్‌రెడ్డిని టీజీ భరత్ తమ ఇంటికి ఆహ్వానించి సత్కరించారు. కార్యక్రమంలో రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి రగ్బీ పోటీల్లో సత్తా చాటండి



క్రీడాకారులతో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు

కర్నూలు (టౌన్): మహారాష్ట్రలోని పూణేలో ఈనెల 29, 30 తేదీల్లో జరిగే జాతీయ స్థాయి సీనియర్ పురుషుల రగ్బీ పోటీల్లో సత్తాచాటాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు ఆకాంక్షించారు. శుక్రవారం స్థానిక ఒలింపిక్ సంఘ కార్యాలయ ప్రాంగణంలో రాష్ట్ర జట్టు క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల బాపట్లలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచిన జిల్లా క్రీడాకారులు రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారన్నారు. ఏపీ జట్టుకు కోచ్‌గా గుంటూరుకు చెందిన సుమంత్, మేనేజర్‌గా కర్నూలుకు చెందిన శ్రీకాంత్, ఫిజియోథెరపిస్టుగా సురేష్ వ్యవహరిస్తారని చెప్పారు.

పీవీ నరసింహారావు సేవలు చిరస్మరణీయం



పీవీ నరసింహారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



ఏపీ బ్రాహ్మణ సేవా సంక్షేమ మిత్రమండలి ఆధ్వర్యంలో పీవీకి నివాళులర్పిస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్) : పీవీ నరసింహారావు ప్రధానమంత్రి, ఏపీ ముఖ్యమంత్రిగా చేసిన సేవలు చిరస్మరణీయమని డీసీసీ అధ్యక్షుడు కె.బాబురావు అన్నారు.శుక్రవారం పీవీ 104 వ జయంతిని పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీవీ నరసింహారావు తెచ్చిన సంస్కరణలతోనే దేశం అభివృద్ధి పథంలో నడుస్తోందన్నారు. ఏపీ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో భూస్వాముల భూములను లాక్కొని పేదలకు పంచారన్నారు. కార్యక్రమంలో నాయకులు మాజీమంత్రి మారెప్ప, మాజీ ఎమ్మెల్సీ సుధాకరబాబు, మాజీ ఎమ్మెల్యే మురళీకృష్ణ, నాయకులు దామోదారం రాధాకృష్ణ, అనంతరత్నం, బతుకన్న, లాజరస్ తదితరులు పాల్గొన్నారు.

పీవీకి నివాళి

కర్నూలు(అర్బన్): ప్రధానమంత్రిగా పీవీ నరసింహారావు దేశానికి ఎనలేని సేవలు అందించారని బ్రాహ్మణ నేతలు అన్నారు. శుక్రవారం స్వర్గీయ పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా స్థానిక దేవి ఫంక్షన్ హాల్‌లో ఏపీ బ్రాహ్మణ సేవా సంక్షేమ మిత్రమండలి వ్యవస్థాపక అధ్యక్షులు సందేల్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నేతలు పీవీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సందేల్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రధానిగా పీవీ అనేక సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. ఆయన అందించిన సేవలను ప్రతి ఒక్కరు స్మరించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘాల నేతలు కొలుకుల చంద్రశేఖర్, టీవీ రవిచంద్రశర్మ, శ్రీనివాసరాజు, కొలుకుల నరేష్, సత్యం పాల్గొన్నారు.

దళిత మహిళపై దాడిచేసిన వారిపై కేసు నమోదు చేయాలి



కలెక్టరేట్ గాంధీ విగ్రహం ఎదుట ధర్నా చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): వెల్దుర్తి మండలం రత్నపల్లెకు చెందిన దళిత హనుమక్కను కులం పేరుతో దూషించి దాడిచేసిన అగ్రవర్ణాలకు చెందిన వ్యక్తులపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎండీ ఆనందబాబు డిమాండ్ చేశారు. పది రోజులు గడిచినా వెల్దుర్తి ఎస్‌ఐ కేసు నమోదు చేయడం లేదని, ఆయనపై ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. శుక్రవారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ గాంధీ విగ్రహం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం జేసీ నారపురెడ్డి మౌర్యకు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..దళిత హనుమక్క కుటుంబం మూడు తరాలుగా పంటలు పండించుకొని జీవనం సాగిస్తున్న భూమిని అదే గ్రామానికి చెందిన కొందరు ఆక్రమించుకునేందుకు జూన్ 17వ తేదీన ఆమెతోపాటు భర్త రాముడు, కుమారుడు రామాంజనేయులును కులంపేరుతో దూషిస్తూ దాడి చేశారన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి న్యాయం చేయాల్సిన వెల్దుర్తి ఎస్‌ఐ పట్టించుకోవడం లేదన్నారు. కలెక్టర్,జేసీలు స్పందించి కేసు నమోదు చేయించాలని కోరారు. కార్యక్రమంలో భాస్కర్, విజయమ్మ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలి



డ్రమ్ములో నీటిని పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ వై ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక శరీన్‌నగర్ పరిధిలోని కృష్ణానగర్ సచివాలయంలో జరుగుతున్న ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ఆరోగ్య కార్యకర్తలు తమ పరిధిలోని అన్ని గృహాల్లో ఉన్న నీటి తొట్టిలు, కూలర్లు, ఫ్రిడ్జ్‌లు, టైర్లు, పాత బాటిల్స్ వంటి వాటిల్లో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. ముఖ్యంగా దోమలు మలేరియా, డెంగీ, చికున్‌గున్యా మొదలైన ప్రాణాంతక వ్యాధులను కలగజేస్తాయన్నారు. ప్రజలు ప్రతిరోజూ అన్ని నీటి తొట్టిలోని నీరు తీసివేసి వాటిని శుభ్రపరుచుకుని ఎండబెట్టిన తర్వాత మళ్లీ నీరు నింపుకోవాలని, వాటిపై మూత లేదా వస్త్రాన్ని కప్పి ఉంచాలని సూచించారు. అన్ని గృహాల్లో పారిశుద్ధ్యం పనులు, హైపోక్లోరైడ్ పిచికారీ చేయాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ కార్యదర్శులను ఆదేశించారు. ప్రజలు వారి ఇళ్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమల నివారణ చర్యల్లో భాగంగా ఓవర్‌హెడ్ ట్యాంకులు, నీటి నిల్వ పాత్రలు, డ్రమ్ములు పూర్తిగా ఖాళీ చేసి శుభ్రపరచుకోవాలని చెప్పారు. అతిసార వ్యాధికి సంబంధించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట డీసీఎం ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవి, శానిటరీ కార్యదర్శి రాజశేఖర్, ఆరోగ్య కార్యకర్తలు ఉన్నారు.

లాప్‌టాప్ దొంగ దొరికాడు

- చోరీ కేసును ఛేదించిన పోలీసులు



ల్యాప్‌టాప్ చోరీ చేసిన నిందితుడు హెబ్నేజర్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో వైద్య విద్యార్థి ల్యాప్‌టాప్‌ను చోరీ చేసిన వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. ఆసుపత్రిలోని క్యాజువాలిటీలో విధులు నిర్వహిస్తున్న ఓ వైద్య విద్యార్థి ల్యాప్‌టాప్‌ను గురువారం వ్యక్తి తస్కరించాడు. ఈ మేరకు సదరు వైద్య విద్యార్థి మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు ఆసుపత్రికి వచ్చి విచారణ చేశారు. ఆసుపత్రిలోని సీసీ టీవీ ఫుటేజ్‌ను పరిశీలించి దొంగను గుర్తించారు. అతను ముఖానికి ముసుగు ధరించి క్యాజువాలిటీకి వచ్చి ల్యాప్‌టాప్ ఉన్న బ్యాగ్‌ను చోరీ చేసినట్లు గమనించారు. ఈ మేరకు అతను స్థానిక బుధవారపేటకు చెందిన హెబ్నేజర్‌గా గుర్తించి శుక్రవారం అదుపులో తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఆసుపత్రిలో చోరీలు జరుగుతున్న నేపథ్యంలో ప్రత్యేక నిఘా ఉంచాలని సెక్యూరిటీ సిబ్బందిని ఆదేశించారు. సెక్యూరిటీ సూపర్‌వైజర్ ప్రతిరోజూ మూడు షిఫ్టులలో రౌండ్స్ నిర్వహించేలా చూసుకోవాలని చెప్పారు. పోలీసులు ఆసుపత్రిలో రెక్కీ నిర్వహించాలని పోలీస్ ఉన్నతాధికారులను కోరినట్లు తెలిపారు. ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులు సైతం వారి వస్తువులు జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. ఆసుపత్రిలో అడుగడుగునా కెమెరాల నిఘా ఉంచామని పేర్కొన్నారు.

శివప్ప నగర్‌లో బంగారు ఆభరణాల చోరీ

కర్నూలు : బంగారు నగల దుకాణంలోకి గుర్తు తెలియని మహిళ కస్టమర్‌గా ప్రవేశించి ఆభరణాల చోరీకి పాల్పడింది. వివరాల్లోకి వెళితే.. శివకేశవులు, లక్ష్మీదేవి దంపతులు నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని శివప్ప నగర్‌లో బంగారు దుకాణం నడుపుతున్నారు. ఇటీవల వీరు వేరే ఊరికి వెళ్తూ వారి మేనల్లుడిని షాపులో ఉంచి వెళ్లారు. దీనిని అవకాశంగా తీసుకున్న ఓ మహిళ కస్టమర్‌గా షాపులోకి ప్రవేశించి జత కమ్మలు, నెక్లెస్, మూడు డాలర్లు గుట్టుచప్పుడు కాకుండా కాజేసి వెళ్లిపోయింది. దీనిని ఆలస్యంగా గుర్తించిన షాపు నిర్వాహకులు శుక్రవారం నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



వెల్‌కం సార్..

జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన రంజిత్ బాషాను కలిసి బొకే అందజేస్తున్న వివిధ శాఖల అధికారులు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన పి.రంజిత్ బాషాను శుక్రవారం పలువురు కలిసి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. ఏపీఎన్‌జీఓ అసోసియేషన్ ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీసీహెచ్ వెంగళరెడ్డి, జవహర్‌లాల్ నేతృత్వంలో నాయకులు కలెక్టర్‌ను కలిసి సత్కరించారు. జిల్లాను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు అన్ని విధాలా సహకరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నగరశాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఎంసీ కాశన్న, రామకృష్ణ, జిలా ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.రామకృష్ణారెడ్డి, జిల్లా నేతలు ప్రభాకర్‌రెడ్డి, మధు, అరుణమ్మ, కేసీహెచ్ కృష్ణుడు, జిల్లా వ్యవసాయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రవిప్రకాశ్ రావు, 4వ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మద్దిలేటి, ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు నాగేశ్వరరావు, రాష్ట్ర టైపిస్ట్, స్టెనో గ్రాఫర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శంకర్ నాయక్, వెటర్నరీ లైవ్‌స్టాక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, మెడికల్ ఉద్యోగుల సమాఖ్య నేత ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు. కాగా ఆల్ ఇండియా ప్రభుత్వ వాహన డ్రైవర్ల సమాఖ్య ఉపాధ్యక్షుడు అబ్దుల్ హమీద్ కూడా కలెక్టర్ రంజిత్ బాషాను కలిసి సత్కరించారు.

ఉద్యోగుల సమస్యలపై స్పందించండి

కర్నూలు(సెంట్రల్): ఉద్యోగుల సమస్యలపై సానుకూలంగా స్పందించాలని ఏపీజేఏసీ అమరావతి జిల్లా అధ్యక్షుడు వి.గిరికుమార్‌రెడ్డి జిల్లాకలెక్టర్ పి.రంజిత్‌బాషాను కోరారు. శుక్రవారం జిల్లా కలెక్టర్‌గా పి.రంజిత్‌బాషా బాధ్యతలు చేపట్టడంతో



కలెక్టర్ రంజిత్‌బాషాను సత్కరిస్తున్న వీసీహెచ్ వెంగళరెడ్డి, జవహర్‌లాల్ తదితరులు

ఏపీ జేఏసీ అమరావతి పక్షాన పూలబొకే సమర్పించి శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో నాయకులు నాగరాజు, వేణుగోపాల్, రాజు, లోకేష్ రెడ్డి, రామాంజనేయులు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

కర్నూలు(హాస్పిటల్): వైద్య ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా చెప్పారు. నూతన జిల్లా కలెక్టర్‌గా శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన ఆయనను కలెక్టరేట్‌లో ఏపీ హంస అసోసియేషన్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాలన సజావుగా సాగేందుకు ఉద్యోగుల సహకారం చాలా అవసరమన్నారు. ఉద్యోగుల సమస్యలు ఏవైనా సరే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఏపీ హంస అసోసియేషన్ జిల్లా చైర్మన్ రఘుబాబు, సిటీ చైర్మన్ గోవిందు, నాయకులు కరుణానిధి, మద్దూరి వెంకటస్వామి, మాలిక్‌బాషా, కె. సందీప్, త్యాగరాజు, యూనస్ అలి, సీవీ సత్యనారాయణ, సంపత్, లతీఫ్, శ్రీను ఉన్నారు.

సమగ్ర యాజమాన్యంతో అధిక దిగుబడులు

కల్లూరు: రైతులు పంట సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి ఎ.మాధురి రైతులకు సూచించారు. శుక్రవారం కల్లూరు మండలం కొంగన పాడు గ్రామంలోని ఆర్‌బీకేలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో మొక్కజొన్న, నూనెగింజల యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

డ్రై డే పాటిస్తే వ్యాధులు దూరం

కర్నూలు (టౌన్) : ప్రతి శుక్రవారం ప్రజలు డ్రైడే పాటిస్తే సీజనల్ వ్యాధులు దూరమవుతాయని నగర పాలక కమిషనర్ భార్గవ్‌తేజ అన్నారు. శుక్రవారం ఫ్రైడే- డ్రైడే కార్యక్రమంపై శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులు, ఆరోగ్య సహాయకులతో కమిషనర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరపాలక పరిధిలో సిబ్బంది ఇంటింటికి తిరిగి పాతటైర్లు, బాటిళ్లు, బొండాలు, ఎయిర్ కూలర్లు, డబ్బాలు, పూలకుండీలు వంటి వాటిల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించాలన్నారు. వాటి వల్ల లార్వాలు పెరిగి దోమలు ప్రబలుతాయన్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

ఓర్వకల్లు: మండలంలోని కాల్వ గ్రామ సమీపంలో ఉన్న పుట్టగొడుగుల పరిశ్రమలో శుక్రవారం ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పుట్టగొడుగుల పరిశ్రమలో ఉత్తరప్రదేశ్, బీహార్, ఒడిశా, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలకు చెందిన వంద మంది వలసకూలీలు పనిచేస్తున్నారు. వీరంతా అక్కడే పరిశ్రమవారు కేటాయించిన రేకుల షెడ్లలో నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన కొందరు మహిళలు బట్టలు ఉతుకుతుండగా పక్క గదిలో ఉన్న పశ్చిమబెంగాల్‌కు చెందిన యువకులు స్నానం చేయడానికి వెళ్లారు. బట్టలు ఉతుకుతున్న వారిని లోపలికి వెళ్లమని చెప్పారు. అందుకు సదరు మహిళలు నిరాకరించడంతో ఇరువురి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. గమనించిన వారి బంధువులు ఘర్షణకు దిగారు. ఈ ఘటనలో ఇరువర్గాలకు చెందిన 8 మందికి గాయాలయ్యాయి. పరిశ్రమ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి క్షతగాత్రులను కంపెనీ వాహనాల్లో ఓర్వకల్లు ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం వెళ్లిపోయారు. కాగా, జరిగిన ఘటనపై ఇరువర్గాల వారు ఫిర్యాదు చేయకపోవడంతో కేసు నమోదు చేయలేదని ఎస్‌ఐ రాజారెడ్డి తెలిపారు.

బయో గ్యాస్ ప్లాంట్ ఏర్పాటు చేయండి

కర్నూలు : స్థానిక సి.క్యాంప్ సెంటర్‌లోని రైతుబజార్‌లో బయో గ్యాస్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని మాజీ కార్పొరేటర్ సురేంద్ర రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌కు విన్నవించారు. శుక్రవారం కార్యాలయంలో మంత్రిని కలసి వినతిపత్రం అందజేశారు. ఇందుకు మంత్రి భరత్ సానుకూలంగా స్పందించారు. అధికారులతో చర్చించి బయో గ్యాస్ ప్లాంట్ ఏర్పాటు చేసే దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్‌లో చోటు



అబ్రహాం



బాలునాయక్



ఖాజాముద్దీన్



సురేష్

కర్నూలు(హాస్పిటల్): ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గంలో జిల్లా నాయకులు ఉన్నారు. యూనియన్ 18వ రాష్ట్ర మహాసభలు ఈ నెల 27వ తేదీన విజయవాడలో నిర్వహించారు. యూనియన్ రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. ఇందులో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల నుంచి మూడోసారి రాష్ట్ర కార్యదర్శిగా జి. అబ్రహాం, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్. బాలు నాయక్, ఈసీ మెంబర్‌గా ఎస్. ఖాజాముద్దీన్, కె. సురేష్ ఎన్నికయ్యారు.